# రాజా చేప

కథానిక

ము. రా. శాస్త్రి

వంతెనమీద నడుస్తున్న వరదమ్మకి అరవై యేళ్ళుంటాయి. వరదమ్మ ఒణికిపోతూ, ఊగిపోతూ, తూలిపోతూ నడుస్తూంది. కాళ్ళు జారుతున్నాయి. నిల దొక్కుకుంటూ నడుస్తూంది. వంతెన తాటి పట్టీలు వర్షానికి చివికి విరిగిన పేళ్ళ తాళ్ళలో దిగుతున్నాయి. "ఈ వంతెన మరి బాగుపడదు! బాబా!" అనుకుంటూ వంతెనదాటి యివతల పడింది వరదమ్మ.

వంతెన అవతల పాలెంలో వరదమ్మ మకాం. వంతెన దాటి చాకిరీకి ఊళ్ళోకి రావాలి. నాలుగయిదు యిళ్ళలో. పాచి పనులు చేసుకుంటుంది. ఇంటికి రెండు గంటలు చాకిరీ. నెలకి అయిదు రూపాయిలు వస్తాయి. రోజుకి ఎనిమిది పది గంటల చాకిరీకి, నెలకి పాతిక రూపాయల జీతం గిట్టుబాటు.

వరదమ్మ మొగుడు పెళ్ళయిన కొత్తలో ఓ కొడుకు పుట్టేక రంగం వెళ్ళి మరిరాలేదు. ఓ సంవత్సరం గోదావరి వరదలో కొడుకు కొట్టుకుపోయేడు– దిక్కులేని పక్షి వరదమ్మ. పాలెంలో చిన్న పాకలో ఉంటుంది.

శరీరం ముడతలు పడిపోయింది, చేతులమీది చర్మం వేలాడుతూంది. జుట్టు పండిపోయి, బాగారేగిపోయి వానలో తడిసిన పిచ్చిగ్గూడులా ఉంది. నత్తు ముక్కున వేలాడుతూంది. అది బంగారమో, ఇత్తడో అందులో ఉన్నవిరాళ్లో, గోతులో చెప్పడం కష్టం. ఛాతి ఎండిపోయింది– పక్క ఎముకలు లెక్కపెట్టేలా ఉన్నాయి. పొట్ట జావలా బట్ట కట్టుమీంకి జారిపడింది. ఎండి పెట్టిన చర్మం బరబరలాడుతూంది. ఒంగి నడుస్తూంది.

వంతెనదాటి, గుడిదాటి, తాతయ్య హోటలు సమీపించింది వరదమ్మ. చిన్న పాకలో, వీధిమీదకున్న పొయ్యిమీద పెనంమీద పెసరట్లు వేస్తున్నాడు తాతయ్య. పెనంమీద పడ్డ పెసరట్టు వరదమ్మ మనసు పట్టి. అలారం గొలుసులా లాగగానే వరదమ్మ ఆగింది– రెండు పెసరట్లు తాతయ్య దగ్గిర తినాలని వరదమ్మ కోరిక. రెండు పావలాలు అర్ధరూపాయి అవుతుంది. సాదరుకంత ఖర్చు చేసే తాహతు తనకేది? తరిగి పోసిన ఉల్లిచెక్క, పచ్చిమిరపకాయ ముక్కలు, పెసరచోవి, వేడిపెనం కనిపించాయి. తింటున్న జనం కనిపించారు. కమ్మటి వాసన ముక్కులో దూరుతూంది. పెనంకింద నిప్పుసెగలాగ, లోపల కోరిక సెగ ఎగసింది– ఎగసిన కోరిక మీద నీళ్లుజల్లి, ఓమారు ముక్కుపుటాలు రాసుకుని, ముందుకు కదిలింది, "వరహాలమ్మ మనవడికి నీళ్ళు పొయ్యాలి!" అని తలచుకుంటూ–

తోవలో రాజా ఎదురయ్యాడు– మాసిన ముతక పంచని మోకాళ్ళపైకి ఎగగట్టి బరువుగా నడుస్తున్నాడు. చేతిలో

యి త్తడి చె బునీళ్ళు, భుజంమీద తువ్వాలు మాసిన గెడ్డం- అతని వేషమే చెబు తూంది అతను ఎక్కడికి బయలు దేరిందీనూ!

"బాబా! నా పనే జేశావు?" అంది వరదమ్మ ఒణుకు గొంతుతో.

"ఎధవ ముండ! ఇప్పుడేనేటి? నీ ప్రశ్నలు! పొద్దున్నే ఎధవ శకునం! ఎళ్ళేళ్ళు! తర్వాత చూద్దాం!" హడావుడిగా వెళ్ళిపోయాడు రాజా చెంబులో నీళ్లు చింది పడకుండా పట్టుకుని.

రాజా వార్డు మెంబరు; రాజకీయప్పురుగు, ఊళ్ళో గుడి పెత్తన మరమ్మత్తులు, పూజలు, సేవలు, జాతర్లు ఒకటేవిటి? ఆఖరికి మేస్టర్ల బదిలీల్లో కూడా రాజా చెయ్యి ఉంటుంది. తలుచుకుంటే ప్రెసిడెంటుని దింపగలడు. రాజా అంటే ప్రెసిడెంటుకి ప్రాణం.

రాజా పొరుగూరు వెడితే, తెల్ల ఖద్దరు పంచి, ఖద్దరు లాల్చీ, అంచుల కండువా, కాళ్ళకి చెప్పులు ధరిస్తాడు. "గద్దరు జావారే కావాలి!" అని మావగార్ని పీడించి పుచ్చుకున్న జావారుని అపురూపరంగా వినియోగిస్తాడు ఆగస్టు పదిహేనుకీ, జనవరి యిరవై య్యారుకి ఖద్దరు టోపీ నెత్తికెక్కుతుంది.

రాజా భోజనం అయి వాలు కుర్చీలో విశ్రాంతి తీసుకుంటూ ఆరోజు పేపరు తిరగేస్తున్నాడు.

"ఏం బాబా! రాజాబాబు! ఏటయి నాది నాపని? పుచ్చుకొన్నదబ్బు పుచ్చుకుని, కుచ్చీలో కూకుని కునికిపాట్లు పడతన్నావు- నాకు మనియార్డర్లు వస్తయన్నావు. నే బతికుండగా ఒస్తయా? చచ్చినాక వస్తయా? నే ముష్టెత్తినదబ్బు నీ యదాన్నకొట్టి ఇప్పుడేద స్తన్నాను!" వరదమ్మ తన బాధని వెళ్ళగక్కింది.

పేపరు కింద పడేసి, వరదమ్మను చూస్తూ-

"ఎధవ ముండ! ఏమిటి? నాయదాన్నకొట్టేవా? మాటలు జాగ్రత్తగా రానీ! ఇంట్లో కూర్చున్నదాన్ని పిలిచి దిక్కులేని ముసలిముండవి! నీకు వృద్ధాప్యము పెన్సను ఒస్తుంది దాని పద్ధతి నే చెబుతాను నీకు డబ్బువచ్చేలా చూస్తాను-అని చెప్పేను కదూ? అందుకోసం నువ్వు నన్ను యదం గిదం అంటున్నావు-అనకేంజేస్తావు?" బొంగురు గొంతుతో వరదమ్మ మీద తిరగబడ్డాడు.

"అవునయ్యా! ఏడాదయిపోనాది, నాదగ్గిర వంద రూపాయలుచ్చుకుని. కరుసులు అయిపోయినాయిగాని, నాకు దబ్బు యిప్పించేవా? దబ్బిచ్చుకునీ నీకు దండవెట్టాలన్నమాట!"

"అయితే అవుద్ది! జీవితం అంతా సర్వీసు చేసి రిటైరయి, రావలసిన పెన్షను రాక, ఎంతడబ్బు ఖర్చు పెడుతున్నారో మన రావయ్యా మేస్టారినడుగు! డబ్బు పోసినా వాళ్ల కాగితాలు చూసే దిక్కులేదు! ప్రెసిడెంటుగారు ఆరుసార్లు హైద్రాబాదు వెళ్లేరు బోడి ముండవు! నీ లెక్కేమిటి?"

అట్టాగయితే నా సొమ్ము నాకు పారెయ్యిబాబా! నా వృద్ధాప్యం ఎల్లి పోతానే వుంది!"

జేబు లెట్టుక ఊరేగుతున్నాననుకున్నా వేటి? తాలూకా కచేరి చుట్టూ త్రొంభై సార్లు తిరిగేను. ఒస్తది. ఒస్తె నెలకి పాతికో పదిహేనో, గాడకింద పంది కొక్కులా కూర్చుని చదివేవాకా తిం టావు నాకు కానీ యిస్తావా? ఈ రాజా కనిపిస్తాడా?"

"మా బాబే! నీరు పండించి పబ్బం గడుపుకుంటావు!"

చేతులెత్తి మెటికలు విరిచి. విసవిస నడుచుకుంటూ వెళ్లిపోయింది వర దమ్మ.

X X X

లోపల ఫోనులో మాటలు విని పిస్తున్నాయి, బయట బల్లమీద చతికిల బడ్డాడు రాజా. సమితి ప్రెసిడెంటుతో మాట్లాడుతున్నారు ప్రెసిడెంటుగారు

రాజా చెవులు రిక్కించి వింటున్నాడు

అలాగేనండి, ఆదెంత పనండె? అయ్యబాబాయ్! మీరందర్నీ కూడ గట్టుకున్నాక, నా ఒక్కడిదేముందండే? అలాగేనండి! మాటంటే మాటేనండి! మరి తిరుగుండదండి! ఎటొచ్చినా, నా సపో రుటు మీకేనండి. మీరీసారికూడా సమితి పెసెంటు అయిపోయారనుకోండి. అయ్యబాబోయ్ ఎంతమాట?.... ఏముం దండె? ఏంలేదండి! గతంలో మీకు సెప్పిందేనండి! అదే మా వూరి వంతెన- అలాగేనండి, ఆమాట సాలండి! ఏదో మనిద్దరి టైంలోనూ ఈసారి ఆ పనయి పోతే, నాకూ మా ఊరోళ్ళకి కూడా సేటి స్పేక్సనండి! ఉరండి.... సెలవండి! పెట్టేస్తానండి. అయ్!"

ఫోను క్లిక్‌మంది. రాజా లోపలి కెళ్ళేడు

"రావయ్యా! రాజా! ఇప్పుడే నీ ఇస యం మాట్లాడేను! నువ్వూ వచ్చేవు!"

రాజా 'అబద్ధం' అని తెలుసున్నా నిజంలా నమ్ముతాడు! అదే రాజకీయం! ఎదురు కుర్చీలో కూర్చున్నాడు. తన విషయాలు తొంభై ఉన్నాయి అందులో ఏ విషయం మాట్లాడత? ఆఖరికి ఆ వంతెన విషయం కూడా తన విషయం కింద జమకట్టగల సమర్థుడు ప్రెసి డెంటు! దానివల్ల తనకి లాభంఏమిటి?

"ఏ విషయమండి? నా పెన్షను గురించే నాండి? నన్ను రాజకీయ బాధి తుడుగా గుర్తింపించి, నెలకోనూరు ముట్టజెప్పిస్తా నన్న విషయమేనాండి?" అన్నాడు అనుమానంగ.

"అవునయ్యా! అదే! అయిపోతుం దన్నాడు!"

"అవుతుందంటారా?"

"అదేమిటయ్యా? నీకేవన్నా పిచ్చా? ఆయన తలుసుకుంటే ఏటవదు? ఆయన బామ్మరిది జిల్లా పరిసత్తు సేరిమేను. ఆయనతో సెప్పయినా, సంతకం ఎట్టి స్తాడు. అంతెందుకు? మన పక్కని ఆ పంతులికి యిప్పించలేదూ? ఆ పంతులు మొన్నటిదాకా ఎర్ర పేంటూ ఎర్ర చొక్కా, ఎర్ర రుమాలు వాడేవోడు! నువ్వు రంగుమార్చి తెల్లగుడ్డ లేసుకో!

నీ కుపకారం సేస్తకన్నాడీయన! మర్చేడు! సేసేడు!! ఎదురుగుండా సూసీ, నమ్మకపోతే ఎలాగయ్యా రాజా?"

రాజా మనసు నిజం అని నమ్మింది కాని, యిప్పుడు తను వచ్చింది వరదమ్మ పనికోసం! అదే చెప్పేడు రాజా! ఓ వంద దాని దగ్గర తిన్నట్టు కూడా ఒప్పేసుకుని, పరువు నిలబెట్టమన్నాడు–

"అరసీ!" అని ఆ తర్వాత, "అదెంత పనిలే?" అన్నాడు ప్రెసిడెంటు! వెంటనే ఆర్ డీవోకి రింగ్ అయింది.

x x x

అయింది. వంతెన పనికి! ప్రెసిడెంటుగారి మేడ పనికి ఒకేసారి పునాదిరాయి పడింది రంగుల మేడ. ఎత్తయిన వంతెన ఆ వూరికి ఎంతో అందాన్ని, అభివృద్ధిని తెచ్చిపెట్టడం ఖాయం.

రాజా రాజకీయ బాధితుడుగా గుర్తింపబడే వరకూ, రాజకీయాల్తో బాధపడాలి తప్పదు.

వరదమ్మ వృద్ధాప్యపు పెన్షను–మొదటి పదిహేను రూపాయలు అందుకోకుండానే–పరమ పదం అందేసుకుంది.

ఇది నా స్వంత రచన: దానికి అనువాదం, అనుసరణా కాదు అముద్రితం.

## జీవిత విషవృక్షం

బండతనం– మొండితనం: ఈ
రెండూ జీవితాదర్శాలు చేసుకొని
రెండుపూలు; ప
న్నెండు కాయలు కాస్తోంది
నీజీవితవృక్షం.
ఇంకా–
జీవితయజ్ఞంలో
అనురాగం– అభిమానం– జాలి, న్యాయం,
ధర్మం
ఆఖరికి ఆలు బిడ్డలు
ఆహుతి చేసుకొని–
ఏ ఎండా లేకుండ; ఏ వానా కురవకుండానే
ఏ అండ లేకుండ;
ఏ పూలు పూయకుండానే
(అనురాగపువెచ్చదనం – కన్నీరుకురవ
కుండ–హృదయం వికసించలేకుండానే)
కాయలుకాస్తోంది
నీజీవితవృక్షం.
అవన్నీపిచ్చికాయలు. పుచ్చువిత్తులు,
ముళ్ళశాఖలు
అని తెలిస్తే
ఆ చెట్టును కొట్టేస్తుందిదేశం
అంతవరకే నువ్వు క్షేమం.

—శివ